www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025



కబడ్డీ లీగ్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - రాయచోటి



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జి.రెడ్డి ప్రసాద్ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపికయ్యారని, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.హైదర్‌అలీ తెలియజేశారు. ఈ నెలలో హైదరాబాదులో నిర్వహించిన కబడ్డీ సెలక్షన్లలో జి.రెడ్డి ప్రసాద్ చురుకుగా తనదైన శైలిలో ప్రతిభను కనబరచడంతో గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎన్నుకున్నారని చెప్పారు. కబడ్డీ ఆటని హర్యానా రాష్ట్రంలో ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో ఆడుతారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. హైదర్‌అలీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మునియా నాయక్, పీడీ జబ్బీవుల్ల ఇతర అధ్యాపకులు తెలుపుతూ అతనికి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ మరింత ప్రతిభను కనబరిచి జాతీయ జట్టుకు కూడా ఎన్నిక అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించండి

- పోస్టర్ల ఆవిష్కరణలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ పోస్టర్లను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యు.శివ ప్రకాశ్‌రెడ్డి డిఇఒ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ప్రచారంలో భాగంగా యుటిఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. హరి ప్రసాద్, జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒత్తిడి లేని వాతావరణంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన జరుగుతుందని చెప్పారు. నైతిక విలువలతో క్రమ శిక్షణ నేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతారని చెప్పారు. ప్రభుత్వ విద్యా రంగం కనుమరుగు అయ్యే ప్రమాదంలో పడిందని, ప్రభుత్వ విద్యారంగం మనుగడలో ఉంటే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్య అందుబాటులో ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులను ఒప్పించి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించే బాధ్యతను ఉపాధ్యాయులు కర్తవ్యంగా తీసుకోవాలని కోరారు.తల్లిదండ్రులు, సమాజంలోని అన్ని వర్గాల వారు కూడా ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ తమ వంతు బాధ్యతగా భావించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హఫీజుల్లా, రాజా రమేశ్, సహాధ్యక్షుడు రెడ్డి బసయ్య, చిన్న మండెం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు చంద్ర శేఖర్ రెడ్డి, కిఫాయత్, మండల కోశాధికారి ఆదిల్, వీరబల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగార్జున, అమీనుల్లా, ప్రధానోపాధ్యాయులు మొహిద్దిన్ బాషా, నాయకులు రెడ్డి ముని, సుధాకర్, ఇందాద్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అటవీ అధికారుల అడ్డగింత

- అమాయకులను అరెస్టు చేస్తారా?
- ఫారెస్ట్ అధికారులపై తిరగబడ్డ గ్రామస్తులు
- వాహనాలకు అడ్డగింత, ఉద్రిక్తత
- రంగ ప్రవేశం చేసిన పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండలం పొన్నేటిపాలెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చుకు చిక్కుకుని మృతి చెందిన చిరుత కేసులో అటవీ అధికారులు ఏమాత్రం విచారించకుండా అమాయకులైన ముగ్గురిని అరెస్టు చేసి చేతుల దులుపుకున్నారని పొన్నేటిపాళ్యం గ్రామస్తులు ఆరోపించారు. ఇన్నాళ్లు ఉద్యోగం చేయని ఫారెస్ట్ సిబ్బంది చిరుత మృతితో తెగ హడావిడి చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులకు సంజాయిషీ చెప్పుకోవడానికి 24 గంటలు కూడా గడవకముందే అమాయకులైన ముగ్గురిని విచారణకని పిలిచి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పొన్నేటిపాలెం గ్రామంలో చిరుత మృతి చెందిన ప్రదేశానికి శుక్రవారం పిసిసిఎఫ్ అధికారి చలపతిరావు ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ సెల్వం, ఇతర అధికారులు వెళ్లి ప్రదేశాలను పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో వారిని పొన్నేటి పాళ్యం గ్రామస్థులు అడ్డుకున్నారు. ఏ పాపం ఎరుగని మా వాళ్లను ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని నిలదీశారు. వారు ఉచ్చులు వేసినట్లు ఆధారాలుంటే చూపాలని ఎదురుతిరిగారు. అరెస్ట్ చేసిన మా వాళ్లను విడిచి పెట్టకపోతే ఇక్కడి నుండి కదలనివ్వమని వాహనాలకు అడ్డుగా నిలబడ్డారు. సమాచారం అందుకున్న తాలూకా సిఐ కళా వెంకటరమణ, వన్‌టౌన్ ఎస్‌ఐ ఎరిసావల్లి సిబ్బందితో పొన్నేటిపాలెం చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పారు. అధికారులను అడ్డగించడం మరో నేరమవుతుందని, ఇలాంటి చర్యల వల్ల ఇంకా నష్టమే జరుగుతుంది తప్ప న్యాయం జరగదని సర్ది చెప్పారు. గ్రామస్తులు ససేమిరా అంటూ భీష్మించుకు కుర్చొన్నారు. అరెస్టు చేసిన మా వారిని వదిలేవరకు ఇక్కడి నుంచి పంపించమని తెగేసి చెప్పారు. చివరికి సిఐలు కల్పించుకొని గ్రామంలో పదిమంది స్టేషన్‌కు వచ్చారంటే మాట్లాడి న్యాయం చేస్తామనడంతో అటవీ అధికారులను వెళ్ళనిచ్చారు. అనంతరం పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయానికి చేరుకున్న గ్రామస్థులు ఊయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చిరుత పులి ఉచ్చుకు చిక్కుకున్న విషయాన్ని తాము చెబితే తప్ప ఫారెస్ట్ అధికారులకు తెలియలేదన్నారు. ఎవరో వేసిన ఉచ్చుకు చిక్కుకొని ప్రాణాలతో విలవిలాడుతుంటే తామే అధికారులకు చెప్పామన్నారు. పులిని రక్షించేందుకు అవసరమైన సాధనాలతో రాకుండా తీరికగా వచ్చి గంటల తరబడి సమయాన్ని వృథా చేసి అటవీ అధికారులే మూగ ప్రాణాన్ని బలిగొన్నారని ఆరోపించారు. వారు చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు ఆ అభాండాన్ని అమాయకులైన మా గ్రామానికి చెందిన గంగాధర్, రెడ్డప్పరెడ్డి వెంకటరమణారెడ్డి అకారణంగా వారిని అరెస్టు చేశారని వాపోయారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు చిరుత చనిపోతే గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించి ఆ తరువాత గ్రామంలోని ఆ ముగ్గురిని పిలిపించి ఏమాత్రం విచారణ లేకుండా అరెస్టు చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. తాము ధర్నాలు రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తప్పుంటే తమ వారిపై చర్యలు తీసుకోమని తెలిపారు. ప్రాణాలతో ఉన్న చిరుతను కాపాడలేక గంటల తరబడి చోద్యం చూస్తూ చిరుత మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్న మూడు గంటల వరకూ చిరుత ప్రాణాలతోనే ఉందని, ఎండవేడిమికి తట్టుకోలేక అల్లాడుతుంటే కనీసం నీటిని అందించే ఏర్పాటు కూడా చేతలేకపోయారని, దగ్గరుండి మరి చిరుతను చంపించేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై మాత్రం చర్యలు లేవు. అమాయకులైన మావారిని మాత్రం అరెస్టు చేయడమేంటని నిలదీశారు. తాము న్యాయపోరాటం చేస్తామని, న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో) నిరసన తెలుపుతున్న ప్రజలు

ఎస్‌సి వర్గీకరణతో సమన్యాయం : ఎంఎస్‌పి



నిమ్మనపల్లె :ఎస్‌సి వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఎస్‌సి వర్గీకరణతో సమన్యాయం జరుగుతుందని మహాజన సోష లిస్ట్ పార్టీ జాతీయ నాయకులు సొట్ట నరేంద్రబాబు అన్నారు. శుక్రవారం ఎంఆర్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు ఆహ్వానం మేరకు ఆయన పర్యటించి, బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎస్‌సి వర్గీకరణ రిజర్వేషన్ అమలవుతున్న నేపథ్యంలో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎస్‌సి రిజర్వేషన్ వలన కలిగే ప్రయోజనాలను ఎస్‌సి ల్లోని ఒక వర్గమే అధికంగా లబ్ధి పొందుతూ ఉండేదన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ 30 సంవత్సరాల సుదీర్ఘపోరాటం అనంతరం సుప్రీం కోర్టు ఎస్‌సి వర్గీకరణకు ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌సి వర్గీకరణ అమలు చేయడానికి కార్యచరణను సిద్ధం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్‌సి వర్గీకరణ ద్వారా ఎస్‌సి రిజర్వేషన్‌లోని రెండు వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. త్వరలోనే ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ రిజర్వేషన్‌ను అమలు చేయబోతున్నాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఎంఎస్‌ఎఫ్, ఎంఇఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సి ఉప వర్గీకరణ ఆర్డినెన్స్ హర్షణీయం

రాయచోటి: ఎస్‌సి వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చినందుకు రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కార్యాలయంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు ఎస్.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి ఉప వర్గీకరణ ఆర్డినెన్స్ 2 తెచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, రవాణా యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియ జేశారు. వర్గీకరణకు ఆర్డినెన్స్ ద్వారా జిఒను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాదిగల అభ్యున్నతికి మరో అడుగు ముందు కేసి వర్గీకరణ తెచ్చినందుకు మాదిగ జాతి తరపున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ నాయకులు హరిబాబు, జిల్లా నాయకులు డివిఎంసిమెంబర్ జి వెంకటరమణ, రామకృష్ణ , వెంకటరమణ దళిత వేదిక రాష్ట్ర నాయకులు ఓబులేసు లాయర్ వెంకటరమణ పి.మల్లికార్జున, పి.బాలాంజనేయులు, పి.శివ, బి.కిరణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు

- పిసిసిఎఫ్ చలపతిరావు



చిరుత మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని పిసిసిఎఫ్ చలపతిరావు హెచ్చరించారు. మండలంలోని పొన్నేటిపాళ్యంలో బుధవారం చిరుత మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో సమగ్ర విచారణ నిమిత్తం డిప్యూటీ సిఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దర్యాప్తుకు ఆదేశించారు. పిసిసిఎఫ్ చలపతిరావు ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ సెల్వం శుక్రవారం మదనపల్లెకు చేరుకున్నారు. అనంతరం చిరుత మృతి చెందిన ప్రదేశానికి వెళ్లారు. అక్కడ పరిస్థితులను పరిశీలించారు. అనంతరం చలపతిరావు విలేకరులతో మాట్లాడుతూ జంతువులను వేటాడడం చటారీత్యా నేరమని, దీనిని ప్రజలందరూ గమనించాలని తెలిపారు. చిరుత మృతి చెందిన ప్రదేశంలో ఉచ్చు బిగించడాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. సాధారణంగా దుప్పులు, కణితలు, అడవి పందులు తిరిగే ప్రదేశంలో ఉచ్చు వేయలేదని, మరోచోట ఈ ఉచ్చు బిగించడం వెనక ఉన్న ఉద్దేశాన్ని దర్యాప్తులో తెలుసుకొంటామన్నారు. ఇక్కడ ఎందుకు ఈ ఉచ్చు వేశారు, దేనికోసం వేశారు, వారి ఉద్దేశ్యం ఏంటనే అనే కోణంలో దర్యాప్తును చేస్తున్నామని వివరించారు. వాస్తవంగా ఈ ప్రదేశంలో అడవి జంతువుల వల్ల పంటలు నష్టపోయిన దాఖలాలు కనపడడం లేదని, పైపెచ్చు అటవీ ప్రాంతంలోని నీటి సదుపాయం కూడా ఉందన్నారు. కావున అడవి జంతువులు పంట పొలాల వైపు వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అయితే మరేదో ఉద్దేశించే ఇక్కడ ఉచ్చు బిగించారని, దానికి తగులుకొనే చిరుత మ ృతి చెందిందని, దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరి వెంట సబ్ డిఎఫ్ఒ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఒ జయప్రసాదరావు, బీట్ అధికారులు తదితరులు ఉన్నారు.



ట్రోఫీ కైవసం చేసుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్

కెఎస్‌ఆర్‌ఎం ట్రోఫీ 'మిట్స్' కైవసం

ప్రజాశక్తి-మదనపల్లె

కడపలోని కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల వారు నిర్వహించిన ప్రతిష్టాత్మక కెఎస్‌ఆర్‌ఎం ట్రోఫీ-2025ను మిట్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు కైవసం చేసుకున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. అత్యుత్తమ అథ్లెటిసిజం, జట్టు కృషి, పోటీ స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, మిట్స్ విద్యార్థులు వివిధ క్రీడా ఈవెంట్లలో అగ్రస్థానాలను సాధించారని పేర్కొన్నారు. ఆ కళాశాలలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ (మహిళలు), త్రోబాల్ (మహిళలు), కబడ్డీ (మహిళలు), టెన్నికాయిట్ (మహిళలు), బ్యాడ్మింటన్ (పురుషులు) పోటీలలో మొదటి స్థానంలో విజేత నిలిచి ప్రతిభ కనపరిచారని చెప్పారు. చెస్ (మహిళలు) రన్నరప్‌గా నిలిచారన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, పిడి డాక్టర్ దామోదరన్, మంజు విక్రమ్ అభినందనలు తెలియజేశారు. ఇటువంటి విజయాలు సంస్థకు కీర్తిని తీసుకురావడమే కాకుండా, భవిష్యత్ విద్యార్థులు క్రీడల ద్వారా శారీరక, మానసిక అభివృద్ధిలో చురుకుగా పాల్గొనడానికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి - రాయచోటి

సమష్టి కృషితో వైసిపిని బలోపేతం చేసుకుందామని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం తిమ్మక్కగారిపల్లెలో మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రా రెడ్డి నివాసంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి శ్రీకాంత్‌రెడ్డి కార్యకర్తలతో మమేకమయ్యారు. పార్టీ అభివృద్ధిపై చర్చించారు. కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టం వచ్చినా తోడుంటానని భరోసా నిచ్చారు. జగన్ హయాంలో శెట్టిపల్లె గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ 60 కోట్లుకు పైగా లబ్ది చేకూరిందని ప్రజలు, కార్యకర్తలు శ్రీకాంత్ రెడ్డి ఎదుట గుర్తుకు చేసుకున్నారు. శెట్టిపల్లె గ్రామంలో బిటి రోడ్లు, సిసి రోడ్లు డ్రెయినేజీలు, పలు ఆలయాల నిర్మాణాలు, పక్కా గృహాలు, పాఠశాలల అభివృద్ధి, పెద్దబిడికిలో సెల్ టవర్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు ఎన్నో జరిగాయని ప్రజలు గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో గొర్ల అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎంపిపి నాగిరెడ్డి, మాజీ ఎంపిటిసి శివయ్య, ఆనంద రెడ్డి, లాయర్ శ్రీనివాసులు రెడ్డి, ఉమా నాయుడు, మహేశ్వర, నరసింహారెడ్డి, రమణా రెడ్డి, మదన మోహన్‌రెడ్డి, కోట ఆంజనేయులు నాయుడు, శంకరయ్య నాయుడు, మాధవ్ నాయుడు, నౌషాద్ బాష, మోబీన్, సయ్యద్ బాష, షమీర్ బాష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

పిడుగుపాటుకు జెర్సీ ఆవు మృతి

ప్రజాశక్తి-కలకడ



మృతి చెందిన ఆవు వద్ద వెంకటరమణ

పిడుగుపాటుతో జెర్సీ ఆవు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని ఏనుగొం డపాలెం పంచాయతీ ఒంటిల్లుకు చెందిన ఏనుగొండ వెంకటరమణ నాయుడుకు చెందిన పొలం వద్ద ఆవులు మేపుతున్న తరుణంలో గాలివాన వచ్చినట్లు తెలిపారు.ఈ క్రమంలో తనకున్న పశువులను పొలాల వద్ద ఉన్న చెట్టు కింద తోలడంతో పిడుగుపడి వెంకట రమణ నాయుడుకు చెందిన సుమారు రూ.లక్ష విలువ చేసే జెర్సీ ఆవు పిడుగుపాటుకులోనై మృతి చెందినట్లు బాధితుడు వెంకటరమణ నాయుడు తెలిపాడు. రూ.లక్ష విలువ చేసే జెర్సీ ఆవు పిడుగుపాటుకు గురై మృతి చెందడంతో కుటుంబం మొత్తం కన్నీరు మున్నేరుగా విలపించారు. జెర్సీ ఆవులను పెంచుకొని వాటి ద్వారా వచ్చే పాల వ్యాపారం ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబం పోషించుకుంటూ వచ్చేవాడినని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా మారమ్మ తిరుణాల

ప్రజాశక్తి తంబళ్లపల్లి

మండలంలోని కన్యమడుగులో వెలసిన శ్రీ దండు మారెమ్మ ఆలయంలో మర్రిమాకులపల్లె, కన్యమడుగు, ఎద్దులవారిపల్లి పంచాయతీల ప్రజల ఆధ్వర్యంలో అమ్మవారి తిరుణాల వైభవంగా నిర్వహించారు. పూజారి శంకర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందిని బండ్లు, పలురకాల సాంస్కృతిక కార్యక్రమాల ఊరేగింపుతో భక్తులను అలరింప చేశాయి. చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళలు నియమ నిష'లతో అమ్మ వారికి దీలు,బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ కీర్తిశేషులు మిత్రశేఖర్‌రెడ్డి కుమారులు రామకృష్ణారెడ్డి, రవి శంకర్‌రెడ్డి గృహానికి వెళ్లారు. సమస్యలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఎలాంటి సమస్య వచ్చిన అందుబాటులో ఉంటూ పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తానన్నారు.

ఉర్దూ భాషకు భారతదేశం పుట్టినిల్లు : కాంగ్రెస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఉర్దూ భాషకు భారతదేశం పుట్టినిల్లు అని, దీనిపై దురాభిప్రాయం తగదని సుప్రీం కోర్టు అభిప్రాయ పడటంపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కె.భాష హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మహారాష్ట్రలో సైన్ బోర్డులపై ఉర్దూ భాషలో రాయడాన్ని సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ విచారించిన జడ్జిలు ఉర్దూ భాష ప్రజల భాష అని, ఇది మతానికి అంటగట్టడం సమంజసం కాదని పిటిషన్ కొట్టివేయడాన్ని స్వాగతించారు. కొన్ని దశాబ్దాలుగా భారతీయులందరూ కుల మతాలకు అతీతంగా ఉర్దూ భాషను వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. దేశంలోనే ఇతర భాషలతోపాటు ఉర్దూకు ప్రజలతో విడదీయరాన్ని సంబంధం ఉందన్నారు. దీనిపై ప్రజలెవ్వరికీ అపోహలు వద్దని, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉర్దూ భాష రెండవ అధికారిక భాషగా కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉర్దూ భాషను గౌరవిస్తూ ఉర్దూ విద్యాబోధనకు మరింత ప్రాధాన్యతనివ్వాలని కోరారు. 2025 విద్యా సంవత్సరంలో ఉర్దూ పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులను నియ మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, రహదారుల మీద ఉర్దూ భాషతో పేర్లు రాసి గుర్తింపు నివ్వాలని కోరారు. గత కొన్ని దశాబ్దాల నుంచి ఇతర మతాల కవులు ఉర్దూ బాషలోను, ఉర్దూ కవులు ఇతర భాషల్లోనూ కవి సమ్మేళనాలు చేసిన ఘన చరిత్ర భారతదేశానికి ఉందని గుర్తు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ములకలచెరువు మండలంలో జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్తలైన్లు ఏర్పాటు, మెయింటెనెన్స్ కారణంగా బురకాయలకోట 132 కెవి సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడి గోవింద్‌రెడ్డి, ఎఇలు రామ లక్ష్మణ్, గిరి బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ములకలచెరువు,పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. విద్యుత్ ఉండదని వినియోగదారులు, ప్రజలు గమనించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనాథ్

సోనియా కుటుంబంపై కక్ష సాధింపు మానుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ, ఆమె తనయుడు రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న కక్ష సాధింపు కుట్ర రాజకీయలు మానుకోవాలని ఎపిసిసి కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ ఎదుగుదలను జీర్ణించుకోలేక ప్రధాని నరేంద్ర మోడీ దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఇడిలను సొంత ఏజెన్సీలుగా వాడుకొని ప్రతి పక్షంపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకత్వాన్ని అణగదొక్కాలని చూస్తోందని, ప్రశ్నించే గొంతును నొక్కాలని బిజెపి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను స్వాధీనం చేయడాన్ని, కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్ గాంధీపై ఇడి ఛార్జ్ షీట్ దాఖలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. 'మనీ'నే లేని కేసులో మనీ ల్యాండరింగ్ జరిందని ఆరోపణలు చేయడం అత్యంత దారుణమన్నారు. భారత స్వాతంత్ర్య సమర యోధులను, దేశ మహోన్నత నేతలను, వారు చేసిన కృషిని బిజెపి అవమా నపరుస్తోందని ఆగ్రహించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, బిజెపి చేస్తున్న నీచ రాజకీయాలకు, ప్రతీకార చర్యలకు ఇది నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ మీద ఛార్జిషీట్ వేయడం కాదు, బిజెపి మీద ప్రజలే ఛార్జ్‌షీట్ వేసే సమ యం దగ్గరపడిందని హెచ్చరించారు. మోదీ ప్రియ మిత్రులైన అదానీ, అంబా నీలకు దేశాన్ని ఎలా దోచి పెడుతున్నారో ప్రజలకు అర్థం అయ్యింది అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న నీచ రాజకీయలు ఇకనైనా మానుకో వాలని హితావు పలికారు. మోడీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. సమావేశంలో డిసిసి ప్రధాన కార్యదర్శి లింగం నాగేశ్వరావు, డిసిసి అధికార ప్రతినిధి అహమ్మద్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని అన్ని చర్చిలలో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక లూథరన్ చర్చిలో పాస్టర్ ఎంజె.సుందరరావు మాట్లాడుతూ మానవాళి కోసం ఏసు క్రీస్తు చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకునే అత్యంత పవిత్రమైన దినమని, ఏసుక్రీస్తు మరణించి మూడవ రోజు మరణాన్ని జయించి తిరిగి ప్రాణంతో ప్రజల ముందుకు వచ్చిన రోజు గుడ్ ఫ్రైడే అని తెలిపారు. పవిత్ర శుక్రవారం సందరరేగా కీర్తనలు, ఆరాధన, బైబిల్ పఠనము, సువార్త, దైవ సందేశం, సిలువ ధ్యానము మొదలగు భక్తి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో సభ్యులు విజయకుమార్, వీణ గ్రేస్, కమల కుమారి, వాసంతి దేవిడ్, కిషోర్, హిమబిందు, రమాదేవి, నాగరాజ, సునీల్ కుమార్, ప్రమీల రావు, మధు కుమార్, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : పట్టణంలో భక్తిశ్రద్ధలతో భక్తులు గుడ్ ఫ్రైడే ప్రార్థనలను జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన ఆలయమైన సిఎస్‌ఐ జెసిఎం చర్చిలో ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ సంజయ్ కొయర్ బృందం ఆలపించిన భక్తి గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అనంతరం చర్చి పాస్టర్ డాక్టర్ రెవరెండ్ సునీల్ వరకుమార్ ప్రసంగిస్తూ మానవాళి పాపాలను పరిరక్షించేందుకే యేసు సిలువ మరణం చెందాడని తెలిపారు. ప్రభువును ఆరాధించిన ప్రజలే సిలువ వేయమని కర్కశంగా మాట్లాడారని, ఇది ప్రవచనాల నెరవేర్పులో భాగమని వివరించారు. యేసు సిలువపై పలికిన ఏడు మాటలను ప్రజలు అన్వయించుకుని సన్మార్గంలో జీవించాలని ఆకాంక్షించారు. భక్తులు ఉపవాసంతో చర్చికి రావడంతో ప్రార్థనల అనంతరం భక్తులకు జ్యూస్ మజ్జిగ, ఫ్రూట్ సలాడ్ లను ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. ఈ ప్రత్యేక ఆరాధనలో గురువులమ్మ లూసి, సెక్రటరీ జెఇ.భక్తవత్సలం, ట్రెజరర్ ఆనంద్ కమిటీ సభ్యులు సూరి, జుగ్ను, సుజాతదీన పాల్గొనగా జ్యూస్, మజ్జిగ పంపిణీ ఏర్పాట్లను సర్పంచ్ మధు పర్యవేక్షించారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి- రాయచోటి



రక్తదానం చేస్తున్న మౌలాలి

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని దీప బ్లడ్ బ్యాంక్ నిర్వాకుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం స్వప్న అనే మహిళకు డెలివరీ కోసం చాలా అరుదైన ఓ నెగిటివ్ రక్తం కోసం ప్రయత్నం చేశామని చెప్పారు. మారుమూల గ్రామంలో ఉండే మహమ్మద్ మౌలాలికు కాల్ చేసిన తన మిత్రుడు వేల్పుల సిద్ధయ్య అడిగిన వెంటనే తన పనులు మానుకొని వచ్చి రక్త దానం చేశారన్నారు. గొప్ప మనస్సు కలిగిన వారు కొందరు మాత్రమే ఉంటారని చెప్పారు. కొత్త దాతలు కూడా ముందుకు వచ్చి రక్త దానం చేయాలని, దీప బ్లడ్ బ్యాంక్ నందు రక్త నిల్వలు తక్కువ గా ఉన్నవి అన్నారు. రక్త దాతలు ముందుకు వచ్చి పది మందికి సహాయం అందించాలని మల్లిఖార్జున రెడ్డి కోరారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఇఒ గురు మోహన్

గ్రామ పంచాయతీ కార్మికుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పీలేరు

పీలేరు గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం వారు గ్రామపంచాయతీ గ్రేడ్ -1 ఇఒ గురు మోహన్‌ను కలిసి నూతన కమిటీ ఎన్నికైన వారి వివరాలను అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ధరణి వెంకట్రామయ్య, అధ్యక్షులుగాబివి రమణ, ప్రధాన కార్యదర్శిగా ఓబులేసు, కోశాధికారిగా బి.నాగార్జున, మరో 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపట్ల వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్మికులకు అందాల్సిన ఇపిఎఫ్ బకాయిలను కూడా జమ చేస్తానని, తాను విధుల్లో చేరిన తర్వాత ఐదు నెలల ఇపిఎఫ్ జమ చేశానని చెప్పారు. ఈనెల వేతనాలతోపాటు మరో 5 నెలల కాలం ఇపిఎఫ్ జమ చేస్తానని హామీ ఇచ్చారు.

మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-పీలేరు

ఎస్సి వర్గీకరణ విజయ సారథి, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పీలేరులో పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేసిన సందర్భంగా శుక్రవారం పీలేరులో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు, పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో పీలేరు పట్టణం నాలుగు రోడ్ల కూడలిలో మహజననేత షెడ్యూల్ కులాల వర్గీకరణ విజయ సారథి, మాదిగల ఆరాధ్య దైవం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పీలేరు ఎఎంసి చైర్మన్ పురం రామ్మూర్తి, ఇతర నాయకులు, ఎంఆర్‌పిఎస్ సభ్యులు పాల్గొన్నారు.



రామాలయంలో విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న కెకె చౌదరి

విగ్రహ ప్రతిష్టాపనలో ఖాదీ బోర్డు చైర్మన్ కెకె

ప్రజాశక్తి - చిట్వేలు

మండల పరిధిలోని చిట్వేలి గాజులవీధిలో నూతనంగా నిర్మించిన రామాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి శుక్రవారం గ్రామస్తుల ఆహ్వానం మేరకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కెకె చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి ఆశీస్సులతో ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు గ్రామ సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి, నవీన్, కార్జ్ల నాగార్జున నాయుడు, బాలు రెడ్డెయ్య నాయుడు, గూడూరు నాగరాజు, గుండాలయ్య యాదవ్, హరినాథ్, రాజారెడ్డి, గుంటి శేషయ్య, పెద్దూరు రాజశేఖర్, చేబోలు మురళి రెడ్డి, నవీన్, బాలకృష్ణ యాదవ్, వెంకటేశ్వరరాజు, సుబ్రహ్మణ్యం, చంద్రమౌళి, రాయపు వెంకట సుబ్బయ్య, తమ్మిశెట్టి శ్రీనివాసులు, సుధీర్ రెడ్డి, బండారు శివ, మైనారిటీ నాయకులు షరీఫ్ సాహెబ్, కరీం భాష, అద్భుత్ కుమార్, ఆలయ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ రామగోవింద రెడ్డి

జడ్‌పి చైర్మన్లకు గన్‌మెన్‌ల తొలగింపు సరికాదు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర వ్యాప్తంగా జడ్‌పి చైర్మన్లకు గన్‌మెన్‌లను తొలగించడం దారుణమని కడప జడ్‌పి చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్ కుమార్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవక తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వచ్చే జడ్‌పి నిధులతో ఎక్కడ కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసు కుంటామన్నారు. మే 8న జడ్‌పి సమావేశం నిర్వహించనున్నట్లు తెలి పారు. ఈ సమావేశంలో కలెక్టర్‌తో చర్చించి మొదటి ప్రాధాన్యత తాగునీటికి ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశానికి కూటమి ఎమ్మెల్యేలు సమస్యలపై చర్చించకుండా గైర్హాజర్ కావడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట, వేంపల్లె, సింహాద్రిపురం, లింగాలతోపాటు ఆయా మండలాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 కోట్లు వేసవి కాలంలో తాగునీటికి ఖర్చు పెట్టుతామని వివరించారు. ఇప్పటికే వివిధ రకాల పనులకు సంబంధించి రూ.6 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నా యన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్‌రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీర ప్రతాపరెడ్డి, నాయకులు భరత్ కుమార్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, శ్రీని వాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

కర్మాగారాల్లో పరిశుభ్రత తప్పక పాటించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కర్మాగారాల్లో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం మైదుకూరు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఆధార్, ఏషియన్ పివిసి పైప్స్ ఇండస్ట్రీలో, కొర్రపాడు రోడ్డులోని టివిఆర్ పెట్రోల్ బంక్‌లో అవగాహన కల్పించారు. ముందుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రఘునాథ్ మాట్లాడుతూ ప్రతి ఫ్యాక్టరీలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనారు. పదేళ్లకోసారి విద్యుత్ వైరింగ్ మార్చుకోవడం, ప్రతి ఏడాది నిపుణులతో వైరింగ్ చెక్ చేయించుకొని షార్ట్ సర్క్యూట్ ప్రమాదాల నుండి రక్షణ పొందాలని వివ రించారు. కార్యక్రమంలో ఆధార్ పైప్స్ యజమాని సుదర్శ నరెడ్డి, ఏషియన్ పైప్స్ అధినేత సుబ్బారెడ్డి, టివిఆర్ పెట్రో ల్ బంక్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రహారంలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ, నాభిశిల పోతురాజు శిఖర కలశ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గుండ్లకుంట శ్రీరాములు అన్నదానం ఏర్పాటు చేశారు.

వక్ఫ్ బిల్లుతో ముస్లిం సమాజానికి ముప్పు



మదనపల్లె : ప్రజాశక్తి ప్రత్యేక సంచికను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముస్లింల మనోభావాలను దెబ్బతీసే వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించడం ముస్లింపై ఉన్న అభిమానానికి నిదర్శనమని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షులు ఆర్.నిగార్ సుల్తానా పేర్కొన్నారు. శుక్రవారం ప్రజాశక్తి ప్రచురించిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ ప్రత్యేక సంచికను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెజారిటీ ప్రజలు వ్యతిరేకిస్తున్నా వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అమలును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం ముస్లింలను దెబ్బతీ యాలనే కుట్రతోనే వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఆరోపించారు. దేశంలోని సుమారు 25 కోట్ల మంది ముస్లింల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని అంశాలు వివాదాస్పదంగా మారయని, ముఖ్యంగా వక్ఫ్ ఆస్తుల సర్వే బాధ్యతను జిల్లా కలెక్టర్‌కు అప్పగించడం, వక్ఫ్ బోర్డులలో నామినేటెడ్ సభ్యుల నియామకం, బోర్డు నిర్వహణలో ప్రభుత్వ జోక్యం పెరగడం వంటి నిబంధనలపై ముస్లింలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని టిడిపి, జనసేన పార్టీలు వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతునిచ్చి చారిత్రాత్మక తప్పు చేశాయన్నారు. దీనిపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కేంద్రాన్ని వివరణ కోరడం హర్షణీయమన్నారు. ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీలకు అండగా వుంటుందని తెలిపారు. అంతకుముందు టిప్పు సుల్తాన్ మైదానంలోని జామియా మసీదు నందు వక్ఫ్ సవరణ చట్టంతో వాటిల్లే ప్రమాదాలు గురించి ప్రచురించిన ప్రజాశక్తి సంచికను ముస్లిం సోదరులకు పంచిపెట్టి అవగాహన కల్పించారు. అవసరమైతే వక్ఫ్ సవరణ చట్టంపై ముస్లింలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. **రాజంపేట అర్బన్:** వక్ఫ్ బోర్డు ఆలయాలకు సంబంధించిన ఆస్తులను బిజెపి ప్రభుత్వం కాజేయాలన్న యోచనలో ఉందని ముస్లింలందరూ ముక్తకంఠంతో దీనిని ఖండించాలని నియోజకవర్గ ఎంపిజె అధ్యక్షులు పఠాన్ మూసిన్ ఖాన్ అన్నారు. పట్టణంలోని పెద్ద మసీదు వద్ద శుక్రవారం ఆయన ప్రజాశక్తి ప్రచురించిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ ప్రత్యేక సంచికను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో ముస్లిమ్ యేతరులను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ప్రముఖ న్యాయవాది ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు అక్రమ సవరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దేశంలో ప్రజాస్వామ్య, లౌకికవాద పరిరక్షణకు కృషి చేస్తున్న కమ్యూనిస్టు పార్టీలను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు ఎస్‌ఎండి కరీం, సయ్యద్ ఇలియాజ్, షేక్ షాహిద్, పఠాన్ కరీముల్లా పాల్గొన్నారు. **రాయచోటి టౌన్:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముస్లింల సంరక్షణకై చట్టం మార్పులు చేస్తున్నామంటూ చేసిన చట్టం చట్ట వ్యతిరేకమైనదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, సహారా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అన్నారు. ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక శీర్షికను శుక్రవారం రాయచోటిలో ప్రతి గడపగడపకు పంచి వాక్ఫ్ బోర్డు యొక్క ప్రాముఖ్యతను ముస్లింలకు సంరక్షణగా ఉన్నటువంటి చట్ట పరిరక్షణకు మేలుకొలుపుకోవాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి చట్టాలను ఎందుకు సవరించాల్సిందిగా సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడానికి చూస్తే కేంద్ర ప్రభుత్వానికి మొదటి ముట్టిక్కయ్య పడినట్లుగా భావిస్తున్నామని తెలిపారు. అలాగే కేంద్రం తెచ్చిన చట్టాన్ని పూర్తిగా మార్చకుండా అందులోనే నష్టం కలిగినటువంటి అంశాలను సవరిస్తామని చెప్పడం పైన ముస్లిం మైనారిటీ సమాజంలో గౌరవం న్యాయస్థానాల పట్ల గౌరవం పెరుగుతుందని వాళ్ళు తెలిపారు. వాక్ఫ్ చట్టం సంరక్షణకై పాత చట్టాలను కొనసాగించేదాకా తమ సంఘం ఆధ్వర్యంలో విస్తృతమైనటువంటి నిరవధిక రాజీలేని పోరాటాలు, శాంతియుత పద్ధతిలో వివిధ ప్రజా సంఘాల మద్దతు కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో సహారా వెలేరే సొసైటీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ, ప్రధాన కార్యదర్శి షేక్ ఆఫ్తాబ్, జిలాన్ భాష, నాసర్, ఆరిఫ్, ఫర్హాన్, జిలాన్ ఖాన్, నిజాంఖాన్, నవాజ్ షరీఫ్ పాల్గొన్నారు.



రాజంపేట : ప్రజాశక్తి ప్రత్యేక సంచికను పంపిణీ చేస్తున్న ఎంపిజె నాయకులు

ఎన్నాళ్లీ నిరీక్షణ?

- రేషన్ కార్డుల మంజూరుకు మోక్షం ఎప్పుడో
- ఈ నెల, రేపు నెల అంటూ దాటేస్తున్న ప్రభుత్వం
- సచివాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హతకు రేషన్ కార్డ్ ప్రామాణికంగా చేర్చారు. కానీ కొత్త రేషన్ కార్డ్ కోసం ఎన్నాళ్లు నిరీక్షించాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తారని ప్రజలు అనుకున్నారు. కానీ అది జరగలేదు, సంక్రాంతి పండుగకు కొత్త రేషన్ కార్డ్ ఇస్తారని ఆశ కూడా నిరాశ అయింది. మంత్రులు మాత్రం ఈనెల ఇస్తాం.. రేపు నెల ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారే ప్రక్రియ ఇంతవరకు చేపట్టలేదు.

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉండే రేషన్ కార్డుల కోసం నిరుపేద కుటుంబాలు ఎదురు చూపులు చూస్తున్నారు. వైసిపి అధికారంలో ఉండగా పులివెందుల నియోజకవర్గం పరిధిలో తూతూ మంత్రంగా కొంత మందికే కార్డులు మంజూరు చేసింది. 2023 జూన్‌లో వివిధ సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల చేత రేషన్ కార్డుల పంపిణీ సక్రమంగా సాగలేదు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల తరువాత కొత్తకార్డులు ఇస్తామని చెబుతూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్ కార్డు లేని ప్రజల్లో ఆశలు చిగురించాయి. అందుకనుగుణంగా కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు చేర్పులు మార్పులకు అవకాశమిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్ ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతుంది. విషయం తెలియని ప్రజలు రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాలు, సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. 2023 నుంచి నూతనంగా వివాహాలు చేసుకున్నవారు తప్పు ఒప్పులు, మార్పులు చేర్పులు, నూతనగా కార్డులు పొందాల్సిన వారు ఇలా ఎంతో మంది రేషన్ కార్డు లేక తంటాలు పడుతున్నారు. ఆరోగ్యం సరిగా లేనివారికి ఆరోగ్యశ్రీ రాక సిఎం రిలీఫ్ ఫండ్ కోసం అవస్థలు పడుతున్న వారు కూడా కోకొల్లలుగా ఉన్నారు. అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్తవి కోరుతూ మండల, ఆర్‌డిఒ, జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లలో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ కార్డులు చేర్పులు, మార్పులకు అవకాశం లేకపోవడంతో అటు తహశీల్దారు, ఇటు పౌరసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని, త్వరలో ప్రకటన వస్తుం దని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం సమస్యను గుర్తించి రేషన్ కార్డు మం జూరు చేయాలని వేడుకుంటున్నారు.



ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం

నాకు నాలుగేళ్ల కిందట వివాహమైంది. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు. రోజూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. రేషన్ కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. అత్యవసర వైద్యసేవలు పొందాలన్నా ఆరోగ్యశ్రీ లేదు. ప్రభుత్వ అధికారులు తమ గోడు పట్టించుకుని రేషన్ కార్డు మంజూరు చేయాలి.

-లక్ష్మీదేవి, కూలీ, పులివెందుల.

కాళ్లరిగేలా తిరుగుతున్నా

సుమారు ఐదేళ్ల కిందట వివాహం అయింది. నాకు ఇద్దరు సంతానం. రోజువారి కూలీతో నా భర్త కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రేషన్‌కార్డు కోసం అన్ని చోట్ల తిరుగుతున్నాం. కార్డు మంజూరు కాలేదు. సంక్షేమ పథకాలు అందడం లేదు. అధికారులు రేషన్ కార్డు మంజూరు చేసి ఆదుకోవాలి.

- మమత, పులివెందుల

సైట్ ఓపెన్ కాగానే కార్డులు మంజూరు చేస్తాం

రేషన్ కార్డుల సమస్య ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం నివేశన స్థలాలకు సంబంధించిన లాగిన్ అందుబాటులోకి వచ్చింది. అయితే రేషన్‌కార్డులకు సంబంధించిన సైట్ ఓపెన్ కావడం లేదు. కార్డులకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తాం. ఈ క్రమంలో అప్డేట్ జరగ్గానే అర్హులను గుర్తించి రేషన్ కార్డులు మంజూరు చేస్తాం.

- చిన్నయ్య, ఆర్‌డిఒ, పులివెందుల

రబీలో తగ్గిన నూగు సాగు

ప్రజాశక్తి - చాపాడు

రబీలో వేసవి పంటగా సాగు చేసే నూగు పంట ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. జనవరి రెండవ వారం నుంచి ఫిబ్రవరి వరకు రైతులు పంటను సాగు చేపట్టేవారు. ఈ ఏడాది కెసి కాలువలో నీరు ప్రవహిస్తూ ఉండడంతో దుక్కులు ఆలస్యమై సాగు నెమ్మదించింది. పంట సాగు పూర్తిగా తగ్గింది. సాగు చేసిన పంట ప్రస్తుతం నెల పంట దశలో ఉంది. గతంలో మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, విశ్వనాథపురం, బద్రిపల్లి, చియ్యపాడు, సీతారామపురం, అల్లాడుపల్లె, వెంగన్న గారిపల్లె, చెండ్లూరు, రేపల్లె గ్రామాల పరిధిలో 500 ఎకరాల్లో రైతులు పంటను సాగు చేసేవారు. ఈ ఏడాది గతంలో కంటే సాగు తగ్గిందని తెలుస్తోంది. కెసి కాలువలో, కుందూకు కూడా నీరు పూర్తిగా తగ్గింది. సాగు చేసిన పంట మే నెలలో ఎక్కువ భాగం నూర్పిడికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కెసి కెనాల్‌కు మే మెదటి వారం వరకు నీరు వస్తే నూగు పంట పండేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీరు లేకపోవడంతో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వేడి తీవ్రతకు పంటకు నీరు ఏక్కువగా అవసరం అవుతుందని రైతులు చెబుతున్నారు. నూగు పంట సాగుకు ఎకరాకు రూ.పదివేల లోపు మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. నాలుగు నుంచి ఐదు బస్తాల వరకు దిగుబడి వస్తే వేసవిలో ఖర్చులు మిగులుతాయని రైతులు పేర్కొంటున్నారు. కెసి కెనాల్ పరిధిలో రైతులు మాత్రం ఒక తడి నీరు విడుదల చేయాలని కోరుతున్నారు.



జడ్జిగారి కొట్టాలు వద్ద సాగులో ఉన్న నూగు పంట

కళాభారతి నటులకు సత్కారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కళాభారతి నటు లకు ప్రొద్దుటూరు కార్యవర్గ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మా నించారు. ఈనెల 16న నాటక రంగ దినోత్సవ సందర్భంగా విజయవాడ తుమ్మ లపల్లి కళాక్షేత్రంలో కందుకూరి విశిష్ట పురస్కారాలు పొందిన నటులు కే.సుభాష్ చంద్రబోస్, ఆర్.సుబ్రహ్మణ్యం, చదువుల సాహిత్య వేదిక ద్వారా నటభూషణ అవార్డు పొందిన కొత్తపల్లి శీనును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ఉపాధ్యక్షుడు మచ్చ నరసింహ ఆచార్య మాట్లాడుతూ కొత్తపల్లి శీను అనేక నాటకాలలో నటించి ఉత్తమ నటుడిగా రాష్ట్రస్థాయిలో అవార్డులు పొంది ప్రస్తుతం కళాభారతి కార్యదర్శిగా కూడా విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. కెఎస్‌సి బోస్, సుబ్రహ్మణ్యం కూడా కళాభారతి సభ్యులుగా ఉంటూ అనేక నాటకాలలో పాల్గొంటూ మంచి నటులుగా రాణిస్తూ ఉన్నారన్నారు. ఇలాంటి అవార్డులు వరించడం ఆనంద దాయకమని, వారి సేవలను కొనియాడారు. ఈ సభలో నటులు కొత్తపల్లి శీను, సుబ్రహ్మణ్యం, బోసులు వారి వారి నటన అనుభవాలను పంచు కున్నారు. సంస్థ కార్యవర్గ సభ్యులు, ఇతర కళా కారులు పాల్గొన్నారు.



మహాభారతాన్ని ప్రారంభిస్తున్న రూరల్ సిఐ వరప్రసాద్

మహాభారత యజ్ఞం ప్రారంభం

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలో మట్లి పంచాయతీ మాండవ్యనది ఒడ్డున వెలిసిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయం వద్ద శుక్రవారం రాయచోటి రూరల్ సిఐ వరప్రసాద్ మహాభారతాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్, పోలీసు సిబ్బందితో కలిసి కోదండ రామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాభారత యజ్ఞాన్ని ప్రారంభించారు. మొదటి రోజు హరికథ భాగవతారని సీతామాలక్ష్మి చే హరికథ ఏర్పాటు చేశారు. అక్కడ మహాభారతజ్ఞ కార్యనిర్వాహకులు ఏర్పాటుచేసిన భోజనాన్ని కూడా ఆయన స్వీకరించారు. అనంతరం గ్రామస్తులు సిఐని, ఎస్ఐని శాలువా, పూలదండలతో సన్మానించారు. అనంతరం సిఐ కార్యనిర్వాహకులతో మాట్లాడుతూ ఈ మహాభారత యజ్ఞం ప్రతి ఏటా ఇక్కడ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఇది చాలా మంచి కార్యక్రమని తెలిపారు. 13 రోజులు పాటు నిర్వహించే మహాభారత యజ్ఞం జయప్రదంగా ఎటువంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోనే బాధ్యత కార్యనిర్వాహకులపైనే ఉందని తెలిపారు. మహా భారత యజ్ఞాన్ని పూర్తి చేసేందుకు తమతోపాటు అందరూ కలిసికట్టుగా వచ్చి జయప్రదం చేయాలని ఆయన గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జున చారి గ్రామ పెద్దలు, కార్యనిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.



పెట్రోల్ బంకులో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని అదుపు చేసే నివారణ మార్గాల పట్ల ప్రజలందరికీ అవగాహన ఉండాలని పీలేరు అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.మస్తాన్ తెలిపారు. అగ్నిమాపక నివారణ వారోత్సవాల 5వ రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీలేరు పట్టణం లోని గ్యాస్ గోదాములు, పెట్రోల్ బంకుల్లో పనిచేసే సిబ్బంది, ప్రజలకు గ్యాస్, ఆయిల్, విద్యుత్ ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను అదుపుచేసే పద్ధతులు, అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే 101 లేదా 08584 244399, 9963736587 నెంబర్ల ద్వారా అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం అందించి, అగ్ని ప్రమాదాల నివారణలో తమతో సహకరించాలని తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి యస్. మస్తాన్, ఎల్ఎఫ్‌లు కె.నాగిరెడ్డి, ఎన్.హేమాద్రి రెడ్డి, ఎస్.చలపతి, డిఒపిలు జి.కృష్ణమూర్తి, కె.శ్రీనివాసులు, ఎఫ్ఎంలు యం. వెంకటేష్, ఏ.రెడ్డి శేఖర్, డి.మహబూబ్ బాష, టి.చైతన్యకుమార్ యాదవ్, డి.జాకీర్, హోంగార్డ్ టి.షఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మండలంలోని బయనపల్లి గ్రామం శ్రీ వెంకటేశ్వర ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కట్ల రామ్మోహన్‌కు జిల్లా ఖోఖో సంఘం, డాక్టర్ శివ బాబు ఆధ్వర్యంలో ఘన సత్కారం లభించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ రైల్వేలో క్రీడా కోట విభాగంలో ఉద్యోగం సాధించిన రామ్మోహన్‌ను మండలంలోని స్మార్ట్ వర్క్ కోచింగ్ సెంటర్, భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శివ బాబు మాట్లాడుతూ క్రీడల్లో సత్తా చాటితే ఏదైనా సాధించగలమని నిరూపించిన రామ్మోహన్‌ను ప్రతి క్రీడాకారుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికీ చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కడప జిల్లా ఖోఖో సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఆటలు ఉన్నత స్థితికి తీసుకెళ్లడంతో పాటు చదువును కూడా ప్రోత్సహిస్తుందన్నారు. ఆటలాడడం ద్వారా చదువులోనూ ముందుంటున్నారని నేటి విద్యార్థులు నిరూపించడం అభినందనీయమన్నారు. బయనపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దీనదయాల్, పాఠశాల కమిటీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన రిజర్వేషన్ ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించడం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో భారత్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫరూక్, కడప జిల్లా ఖోఖో సంఘం సంఘం ప్రతినిధులు రామ సుబ్బారెడ్డి, నరేంద్ర, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-రామాపురం

వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు వివరాలు మేరకు.. రామాపురం సబ్ పోస్ట్ ఆఫీస్ గ్రామీణ సడక్ ప్యాకర్‌గా పనిచేస్తున్న సాయి సూర్య (20) నీలకంఠరావుపేట దర్గా సమీపంలో గురువారం రాత్రి మోటార్ సైకిల్ బంధువుల ఇంటికి వెళుతూ అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడ ఒక్కడే మృతి చెందాడు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం ఉదయం స్కూటర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో టిడిపి కార్యకర్త పప్పిరెడ్డి ఇరగంరెడ్డి (50) అక్కడికక్కడే మృతిచెందాడు. మండలంలోని హసనాపురం పంచాయతీ గొల్లపల్లి చెందిన ఇరగం రెడ్డి ఇంటి వద్ద నుండి ద్విచక్ర వాహనంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చారు. ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేయడానికి వెళుతూ రోడ్డు దాటుతుండగా కడప వైపు నుండి వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

పప్పిరెడ్డి మృతికి లక్ష్మీప్రసాద్ నివాళి

మండలం కేంద్రంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన పప్పిరెడ్డి ఇరగంరెడ్డి రోడ్డు దాటుతుండగా కడప వైపు నుండి వస్తున్న కారు డీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరులు టిడిపి నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి నివాళి అర్పించారు. లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలియజేశారు. ఆయన వెంట రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు, కారు ఢీ : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పుల్లంపేట

కడప-రేణిగుంట జాతీయ రహదారిపై మోడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకెళ్తే మైదుకూరుకు చెందిన రాజేష్ తన వ్యక్తిగత పనిమీద తన కారులో తిరుపతికి బయలుదేరి వస్తుండగా మార్గమధ్యంలో పుల్లంపేట మండలం మోడల్ స్కూల్ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అడ్డుగా రావడంతో తప్పించబోయి ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టాడు. కారు ధ్వంసం కాగా రాజేష్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా గాయపడ్డ రాజేష్‌ని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు.